వ్యాధుల డ్రై వాష్

- రోగాల వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ఆరోగ్య సిబ్బంది చర్యలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- నేడు గ్రామాల్లో 'ఫ్రైడే – డ్రైడే'



న్యూ చిట్యాలలో ఎబేట్ పిచికారి చేయిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

బెల్లంకొండ: వాతావరణం మారింది. పగలు ఎండ, రాత్రిళ్లు తీవ్ర చలి. శీతాకాలం సీజనల్ వ్యాధులు విజంభిస్తున్నాయి. వ్యాధి వచ్చాక వైద్యం కంటే.. ముందుస్తు నివారణ చర్యలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాధాన్యమిస్తోంది. ప్రతి నెలా 'ఫ్రైడే– డ్రైడే' కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్తున్నారు. నీటి నిల్వలను తొలగించి, దోమల వృద్ధితో వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. వాటిని ఎలా అదుపులో పెట్టాలో వివరిస్తున్నారు. డ్రైడేను గ్రామీణులందరూ పాటించేలా వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

ఫ్రైడే– డ్రైడే లక్ష్యం

నీరు, గాలి, ఈగలు, మట్టి మలినాలు, అపరిశుభ్రత, చేతులు శుభ్రం చేయకపోవడం వంటి వాటి వల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలు అధికం. ఈ విషయాన్ని వివరించడమే ఫ్రైడే ఫ్రైడే ప్రోగ్రాం లక్ష్యం. గ్రామాల్లో జ్వర సర్వే చేయడం, డెంగీ, మలేరియా వ్యాధులు కలుగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం. శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అంటు రోగాలకు కారణమయ్యే కుళ్లిన నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తినకుండా ప్రజలను అప్రమత్తం చేయడం, చేతులను శుభ్రం చేసుకునే విధానాలను ప్రజలకు వివరించడం వంటి చర్యలు తీసుకోవడం ఇందులో ఉన్నాయి.

గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు..

ప్రతి నెలలో నాలుగవ శుక్రవారం ఫ్రైడే –ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల బాట పడుతున్నారు. గ్రామాలకు బృందాలుగా వెళ్లి, అన్ని గృహాలు సందర్శించి ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రెయిన్లు వంటి వాటిని పరిశీలించి, దోమల వ్యాప్తి చెందకుండా మందులు పిచికారి చేస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫీవర్ సర్వే ద్వారా ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యులందరినీ పరిశీలించి, అనారోగ్యంతో ఉన్న వారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.



మన్నెసుల్తాన్‌పాలెంలో శానిటేషన్ చర్యలు చేపడుతున్న ఆరోగ్య సిబ్బంది

ముందు జాగ్రత్త చర్యలు ముఖ్యం



ముందు జాగ్రత్తగా చర్యలతో వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. దోమల వ్యాప్తి చెందే ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఆశ కార్యకర్త తమ పరిధిలో ప్రతి రోజు 30 కుటుంబాలను సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. మలేరియా, చికున్ గున్యా, మెదడువాపు, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు తదితర వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. దోమల వ్యాప్తి చెందకుండా ద్రావణాలను పిచికారి చేస్తున్నాం.

– బాషా, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ చంద్రాజుపాలెం, బెల్లంకొండ

క్లుప్తంగా

మానసిక ఆరోగ్యంపై అవగాహన

సత్తెనపల్లి: కౌమార బాలబాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి అన్నారు. పట్టణంలోని వేద కళాశాలలో గురువారం కౌమార బాలబాలికల మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుక్త వయసులో పౌష్టికాహార లోపం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలబాలికల అభ్యున్నతికి, బాలికల భద్రతకు వైద్య శాఖతో పాటు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆహారం నుంచి ఆరోగ్యం వరకు అన్ని జాగ్రత్తలను పాటించాలని డాక్టర్ ఆసియా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూటేషన్ రికవరీ నిలిపివేతపై హర్షం



అమరావతి: ప్రభుత్వ పెన్షనర్లకు 135 నెలలు, అంతకు మించి కమ్యూటేషన్ రికవరీ చేసిన వారికి ఈ నెలలో కమ్యుటేషన్ రికవరీ నిలిపివేసినట్లు అమరావతి– పెదకూరపాడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి. కోటేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి రాష్ట్ర పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు లేఖ రాడంతో.. కమ్యూటేషన్ రికవరీ నిలిపివేయడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర బాధ్యుడు కొసరాజు రంగారావు మాట్లాడుతూ 180 నుంచి 135 నెలలకే పరిమితం చేసి కమ్యూటేషన్ తగ్గించినందుకు హర్షం వ్యక్తం చేశారు. డిసెంబరు 17న పెన్షనర్స్ డే ఘనంగా జరపాలని సమావేశం తీర్మానించిందన్నారు. సంఘ సభ్యులు సుబ్బారావు, తిమ్మయ్య, హనుమంతరావు, నాగేశ్వరరావు, బాస్కరరెడ్డి, చిన్నపరెడ్డి మస్తాన్‌రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పెదకూరపాడు : మండల కేంద్రం, కంభంపాడు నాగేంద్ర స్వామి శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు నిర్వహించారు. అనిల్ శర్మ, హనుమంతరావు శర్మ పంచామృత అభిషేకాలతో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాలికల హక్కులు కాపాడుదాం

88త్యాళ్లూరు(క్రోసూరు): బాల్య వివాహాలను నివారించి, బాలికల హక్కులు కాపాడుదామని పంచాయతీ కార్యదర్శి శిరీషా అన్నారు. గురువారం గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 88 తాళ్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై సమావేశం నిర్వహించారు. తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఏఎన్‌ఎం సరస్వతీ, ఆశ వర్కర్లు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ విజిట్



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ గురువారం చేపట్టారు. సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, ఐసోలేటర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, పలు రకాల ఇన్సూలేటర్‌ల ఫీడర్స్, బేకర్స్, సబ్ స్టేషన్ ఉపయోగాలను ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు జి.రాఘవేంద్ర, సాయిదేవ్ విద్యార్థులకు వివరించారు. ఆపరేటర్ రియాజ్, జీఎల్‌ఎం రాజు విద్యార్థులకు కాంపోనెంట్స్ గురించి వివరించారు. హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు హైమావతి, నాగబాబు పాల్గొన్నారు.

రుద్రవరంలో ఉపాధి హామీ గ్రామసభ

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో ఉపాధిహామీ పథకం గ్రామ సభ గురువారం నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ జి.ఏడుకొండలు పాల్గొని 2025–26 ఆర్థికం సంవత్సరం గ్రామంలో చేపట్టబోయే పనుల గుర్తింపు, గుర్తించిన పనులపై చర్చించారు. మినీ గోకులం షెడ్లను త్వరితగతిని పూర్తి చేయాలని సూచించారు. ప్రాధాన్యం క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. గ్రామ సభలో సర్పంచ్ రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూలే చొరవతో మహిళల జీవితాల్లో వెలుగులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నాయకుల నివాళి

సత్తెనపల్లి: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే చొరవతోనే మహిళల జీవితాల్లో వెలుగులు వచ్చాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. చల్లంచర్ల మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని గుర్తించి పోరాడిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పెండెం బాబురావు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నిస్వార్థ జీవితాన్ని గడిపిన జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుద్దామని పిలుపు నిచ్చారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వరరావు, షేక్ మౌలాలి, వల్లెం నరసింహారావు, బండి మల్లికార్జునరెడ్డి, శివ సాయి, మధు, ఘోర పాల్గొన్నారు.

- పట్టణంలోని తాలూకా సెంటర్‌లో బీసీ సంఘం పట్టణ నాయకుడు పిక్కిలి శివ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కంటూ వెంకట్రామయ్య, పత్తిపాటి హరే కృష్ణ, కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.
- వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కొమెర వీరాంజనేయులు, వడ్డెర సంఘ నాయకులు ఒంటి పులినాగేశ్వరరావు, పల్లపు ధర్మారావు, గుంజి విజయ్ కుమార్, చల్లా ఆంజనేయులు, వల్లెపు బ్రహ్మయ్య పాల్గొన్నారు.
- రఘురామ్‌నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, టీడీపీ నాయకులు సయ్యద్ పెదకరీముల్లా, సయ్యద్ మహబూబ్ ఉన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే పూలే లక్ష్యం

అమరావతి: అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పోరాడిన జ్యోతిరావు పూలే నేటి తరానికి ఆదర్శమని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో గురువారం పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. జి.దేవరాజు, ధారా ప్రసాద్, తోకల సూరిబాబు, మోహిద్దీన్‌వలి, మురహరి, సుబ్రహ్మణ్యం, నాగబాబు, రాజు, కుమార్, మధు, పాములు, కృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.



పట్టణంలో పూలే విగ్రహానికి వడ్డెర సంఘం నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

స్మార్ట్ మీటర్లు వచ్చేశాయి..



అచ్చంపేట: ఇకపై విద్యుత్ వినియోగదారులు విద్యుత్ చార్జీలను రీచార్జ్ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని, ఇప్పుడున్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శివకోటి రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయానికి స్మార్ట్ మీటర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కమర్షియల్ సంస్థలకు, గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. మండలంలో సుమారు 500 ప్రభుత్వ సంస్థలు ఉన్నట్లు చెప్పారు. అచ్చంపేటలోనే 80కి పైగా ఉన్నాయన్నారు. రోజుకు సుమారు 20 చొప్పున స్మార్ట్ మీటర్లు బిగిస్తామన్నారు. ఈ ప్రక్రియ నాలుగు నెలలపాటు కొనసాగుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులపై చార్జిషీట్‌లు దాఖలు చేయాలి

క్రోసూరు: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యుడు గార్లపాటి దాసు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో అట్రాసిటీ పెండింగ్ కేసులపై వెంటనే కోర్టులో చార్జ్ షీట్ వేయాలన్నారు. పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో ఎస్సీలపై పెట్టిన కేసును కొట్టేయాలన్నారు. అచ్చంపేట గురుకుల బాలుర వసతి గృహం సమస్యలు పరిష్కరించాలని కోరారు. సత్తెనపల్లి రామకృష్ణాపురం బాలికల గురుకుల వసతి గృహం నూతన భవనాలు నిర్మించాలన్నారు. క్రోసూరు కేజీబీవీలో గ్రౌండ్ లెవెల్ బాగు చేయించాలన్నారు. పలు సమస్యలను కలెక్టర్ పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



పెదకూరపాడు: ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం పంపిణీ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో 12 మందికి రూ.14,02,069లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రతి విషయంలో అండగా నిలిచే విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ హనుమంతరావు

బెల్లంకొండ: కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని క్రోసూరు ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. గురువారం మండలంలోని బెల్లంకొండ గ్రామంలో 'పొలం బడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది పూత, మొగ్గ, పిందె దశలో చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మారుక ఆకు చుట్టు పురుగు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గుడ్డు లార్వా దశలు వృద్ధి చెందకుండా పంటను కాపాడుకోవాలని, బెట్టను నివారించేందుకు నీటి తడులను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, ఎంపీఈఓలు శ్యాం ప్రకాష్, రహమతుల్లా, రైతులు పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ

బెల్లంకొండ: చంద్రాజుపాలెం గ్రామంలో నిమ్మ తోటలో ఉన్న బోర్ విద్యుత్ మోటార్ వైర్‌ను కత్తిరించి, అందులోని రాగి తీగను దొంగలు ఎత్తుకెళ్లారు. గురువారం రైతు బూతుకూరి అప్పిరెడ్డి వివరాలు వెల్లడించారు. బోర్‌లోని మోటార్‌ను బయటకు లాగి, విద్యుత్ తీగను కత్తిరించినట్లు తెలిపారు. నిమ్మ తోటకు నీటి తడులు ఇస్తున్న తరుణంలో తీగను చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు.



చోరీకి గురైన మోటార్‌ను చూపుతున్న రైతు

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

రాజుపాలెం: యువత 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటు హక్కు పొందాలని తహసీల్దారు దుర్గేష్‌రావు తెలిపారు. కొండమోడులో విద్యార్థి జూనియర్ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు అందరి బాధ్యతన్నారు.



విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

డీఈఓ ఐ.చంద్రకళ పాఠశాలల ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల పఠన సామర్థ్యం పరిశీలిస్తున్న డీఈఓ చంద్రకళ

అమరావతి: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఐ.చంద్రకళ పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింగాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గది వాతావరణం, బోధన విధానం పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాన్ని పరీక్షించారు. 10వ తరగతి విద్యార్థుల నోట్ బుక్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన ప్రమాణాలను విశ్లేషించడానికి స్లిప్ పరీక్షలు, 3, 4 తరగతుల విద్యార్థులకు పఠన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సమావేశం నిర్వహించి సిబ్బంది, ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. నెమ్మదిగా నేర్చుకునే విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రతి తరగతికి సబ్జెక్ట్ వారీగా వారి ట్రాక్ రికార్డ్‌ను నిర్వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రత సక్రమంగా నిర్వహించాలని ఆయాలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చదివారు... ఆమోదించారు



అజెండాను నిశితంగా వింటున్న కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు

- 15 అంశాలకు 15 నిమిషాలు సమయం
- ఇదీ మున్సిపల్ అత్యవసర సమావేశం తీరు

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరైన ఈ అత్యవసర సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ఎలాంటి చర్చ జరగలేదు. కేవలం అజెండా చదవడం ఆమోదించడంతో సరిపెట్టారు. పట్టుమని అజెండాలోని 12 పేజీల్లో 15 అంశాలను 15 నిమిషాల్లో చదవగా అన్నింటికీ తలలు ఊపి ఆమోదించారు. తూతూ మంత్రంగా సమావేశం ముగిసింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.



సమావేశాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి

సంక్రాంతికి రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: వచ్చే సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశించారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల తన కార్యాలయంలో గురువారం ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి చిహ్నాలు రోడ్ల నిర్మాణం, ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలు పూడ్చడంపై అధికారులు శ్రద్ధ చూపించాలన్నారు. నియోజకవర్గానికి రూ.6.65 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి రూ.1.42 కోట్లు, ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. దరువూరి నాగేశ్వరరావు, అధికారులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నియోజకవర్గంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ పంపిణీ చేశారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడుకు చెందిన దుసరా వెంకట కోటేశ్వరరావుకు రూ.59,692, కుబాద్‌పురం చింతగుంట్ల శ్రీనుకు రూ.85,440, నెమలిపూరి గ్రామానికి చెందిన దీపంగి నారాయణకు రూ.49,258, సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం గ్రామానికి చెందిన పొన్నెకంటి వంశీకృష్ణకు రూ.1,05,343, ముప్పాళ్ల మండలానికి చెందిన బద్దిగం రామ తులసమ్మకు రూ.1,08,600, కంభంపాటి వినీత్ కుమార్‌కు రూ.2,52,304, బద్దిగం నాగమల్లేశ్వరికి రూ.1,08,600 చెక్కులను పంపిణీ చేశారు.

అన్నివర్గాల మేలు కోరేవారే రెడ్డి వంశస్తులు

మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి

అచ్చంపేట: అన్ని వర్గాలు, జాతులు, వర్ణాలు మేలు కోరి, అందరికి సమన్యాయం చేసేవారే రెడ్డి వంశస్తులని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి అన్నారు. నీలేశ్వరపాలెంలోని మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో గురువారం రెడ్డి సామాజికవర్గ కార్తిక సమారాధన నిర్వహించారు. నీలకంఠేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో క్రీ.శ.1325 నుంచి క్రీ.శ.1448 వరకు రెడ్డి రాజ్యం ఉండేదన్నారు. అద్దంకి, కొండవీడు, రాజమహేంద్రవరం, కందుకూరులను రాజధానులుగా చేసుకుని రెడ్డి రాజులు పరిపాలించారన్నారు. ఆ తరం నుంచి నిన్నమొన్నటివరకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పరిపాలనలలో ఏ రకమైన వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా అందరికి సమన్యాయం చేస్తూ సంక్షేమ ఫలాలు అందించినట్లు తెలిపారు. అతిథులు యర్రం వెంకటేశ్వరరెడ్డిని, ప్రముఖ వైద్యులు గజ్జల నాగభూషణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజరెడ్డిని, బెల్లంకొండ మండల ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డిని, మాజీ సర్పంచ్ కాల్వపల్లి సాంబిరెడ్డిని నిర్వాహకులు దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం అన్నదాన సమారాధన నిర్వహించారు. 1,600కు పైగా రెడ్డి వర్గీయులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని నరశింహారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, సొసైటి మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, కేవి పాలెం సర్పంచ్ బోనం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అనుముల సాంబిరెడ్డి, తుమ్మా మల్రెడ్డి, గొటిక శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెన్నా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

బెల్లంకొండ: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటోందని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో గురువారం 'దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్' యాప్ పైన వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25 వరకు యాప్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ లోగా యాప్‌లో ప్రతి పౌరుని శారీరక, మానసిక, ఆరోగ్య సమాచారాన్ని సిబ్బంది వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆరోగ్యాంశాలపై ప్రతి రోజు మెసేజ్ రూపంలో సూచనలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల, టీడీపీ నాయకుడు వెన్న సీతారామిరెడ్డి పాల్గొన్నారు.